క్లుప్తంగా

ఉపాధికి భరోసా కల్పించాలని వినతి

మల్కాపురం: ఐదు దశాబ్దాలుగా పని చేసిన తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని షిప్‌యార్డ్ మాజీ సొసైటీ కార్మికుల సంఘం ప్రతినిధులు, సొసైటీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గణబాబును శనివారం కార్మికులు కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో సుమారు 271 మంది కార్మికులు వివిధ డిపార్టుమెంట్‌లలో పని చేస్తున్నారని వివరించారు. ఇంత కాలం షిప్‌యార్డ్ మేనేజ్‌మెంట్ వర్క్ ఆర్డర్‌తో కార్మికులతో పని చేయించుకుందని... ఇప్పుడు వర్క్ ఆర్డర్ కాకుండా సర్వీస్ ఆర్డర్ పై పని చేయాలని యాజమాన్యం చెప్పడంతో తమకు ఆందోళన మొదలైందని వాపోయారు. సొసైటీ నాయకుడు గిన్ని శివరెడ్డి మాట్లాడుతూ సర్వీస్ ఆర్డర్‌పై పని చేయడం అంటే చాలా మంది కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకుంటుందని వివరించారు.యామమాన్యంతో మాట్లాడి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గణబాబును కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కార్మిక నాయకులు తెలిపారు.

బీసీ సమన్వయ కమిటీ కో కన్వీనర్‌గా అల్లు



నియామక పత్రం అందుకుంటున్న అల్లు రమణరావు

మల్కాపురం: బీసీ సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో- కన్వీనర్‌గా అల్లు రమణరావు యాదవ్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని శనివారం బీసీ రాష్ట్ర సమన్వయ కమిటీ ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా రమణరావుయాదవ్ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో పదవి ఇచ్చిన బీసీ సమన్వయ కమిటీ ప్రతినిధి పూర్ణచంద్రరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

పాసుల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల గేటు పాసులు మార్చాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు కోరారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు శనివారం స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మిక సంఘాలకు తెలియకుండా యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు ప్లాంట్ మనుగడకు ప్రమాదకరమన్నారు. పాసుల మార్పు చేయాలనే యోచనను ఉపసంహరించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్. రావు, రమణమూర్తి, వై.టి. దాస్, శ్రీనివాసరాజు, పి.వి. నగేష్, మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

సీతంపేట : బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రూపొందించిన డైరీ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఫోరం అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ ప్రధానమంత్రి బాల పురస్కార అవార్డు గ్రహీత ఆకుల సాయి సంహిత, అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడాకారిణి బొల్లాప్రగడ శ్రీసాహితి, జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ వి.వి.వామనరావు, సౌత్ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామనరావు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, ఉల్లంఘనాంశాలపై ఫోరం దృష్టి సారించాలన్నారు. సాయి సంహిత, శ్రీసాహితి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేలా ఆటలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు, చైల్డ్ రైట్స్ ఫోరం కృషి చేయాలని సూచించారు. గొండు సీతారాం మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ ఫోరం తనదైన శైలిలో వ్యవహరించి రాష్ట్రంలో చక్కని బాలల సంఘంగా పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా... వేసెయ్ పాగా..!



మద్రిపాలెంలో చదును చేసిన ఖాళీ స్థలం

ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కూటమి నేతలు పాగా వేసేస్తున్నారు. కాలనీల్లో ఖాళీ స్థలాలను ఆక్రమించి వాటిలో దర్జాగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలమని తెలిసినా కూటమి నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – విశాఖ విద్య

- 'పశ్చిమ'లో రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు
- ప్రభుత్వ భూముల్లో దర్జాగా భవన నిర్మాణాలు
- కోర్టు కేసులు ఉన్న స్థలాల్లోనూ కట్టడాలు
- ప్రభుత్వ భూముల్లో మాయమవుతున్న హెచ్చరిక బోర్డులు



వుడాలే అవుట్ ఖాళీ స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



కరాసలో ప్రభుత్వ స్థలంగా గుర్తించిన చోట నిర్మించిన భవనం



ఖాళీ స్థలంలో ఉన్న చెట్లను నరికేసిన దృశ్యం

కనుమరుగవుతున్న ప్రభుత్వ భూమి

జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. కబ్జారాయుళ్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. లిటిగేషన్ భూములు, ఖాళీ స్థలాలపై కన్నేసిన కూటమి నేతలు, వాటిని కాజేసేందుకు పావులు కదుపుతున్నారు. జీవీఎంసీకి సంబంధించిన స్థలాల పరిరక్షణ పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం మాయం చేస్తున్నారు.

కోర్టు కేసు ఉన్నా ఆగని పనులు

52వ వార్డు పరిధి కరాసలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల ఇచ్చిన ప్లాన్‌తో స్థలంలో భవన నిర్మాణం చేపట్టగా, అది తమ స్థలం అంటూ వేరొకరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో అక్కడ యథాస్థితి కొనసాగించాలని న్యాయస్థానం ఆదేశించడంతో ఈ వ్యవహారం తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనని భావించిన జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేశారు. తీరా అది ప్రభుత్వ స్థలమని తేలింది. దీంతో ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేసిన అనుమతులను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వెనక్కి తీసుకున్నారు. అయినప్పటికీ అక్కడ భవన నిర్మాణ పనులు కొనసాగుతుండడం గమనార్హం.

ఆక్రమణలను అడ్డుకునేవారేరీ?

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ పర్వం జోరుగా సాగుతోంది. 52వ వార్డు మద్రిపాలెం వుడాలే అవుట్‌లో స్థలాలకు భారీ డిమాండ్ ఉంది. ఇలాంటి చోట ఖాళీగా ఉన్న స్థలాలను ఇటీవల కొంతమంది చదును చేసి అక్కడ ఉన్న చెట్లు నరికేశారు. కొండను తొలిచి గ్రావెల్ కూడా తరలించారు. దీనిపై కాలనీలోని ఇరువర్గాల మధ్య వివాదాలు సైతం జరుగుతున్నాయి. అయినా అధికారులు చోద్యం చూస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

టౌన్‌ప్లానింగ్‌పై విమర్శల వెల్లువ

జీవీఎంసీ జోన్–5 టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరాసలో తొందరపడి ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు లోపాన్ని గుర్తించిన తర్వాత కూడా చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారని, అందుకనే సమస్యలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు దృష్టి సారించాం. ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్టు మా దృష్టికి వస్తే సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. కరాసలో ప్రభుత్వ స్థలంలోఇంటిని నిర్మాంచారు. అనుమతులు రద్దు చేసిన తర్వాత కూడా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు లేఖ రాశాం. దీనిపై ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. ఎక్కడ ఆక్రమణలు జరిగినా మా దృష్టికి తేవచ్చు. – సీహెచ్‌వీ. రమేష్, తహసీల్దార్, గోపాలపట్నం

స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు



శోభాయాత్రలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు

మల్కాపురం: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం శోభాయాత్ర చేపట్టారు. కళాశాల నుంచి ఆర్‌కేపురం వరకు సాగిన ఈ యాత్రలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివేకానందుని మార్గం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన సూచనలు పాటించి ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మేధావుల చర్చ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేసీ రెడ్డి

సీతంపేట : సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్), లంకపల్లి బుల్లయ్య కళాశాల సంయుక్తంగా క్యాంపస్‌లో కేంద్ర బడ్జెట్‌పై చర్చా సమావేశం శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆర్‌జీయూకేటీ మాజీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఆర్. సుదర్శనరావు, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ వంటి మేధావులు పాల్గొని బడ్జెట్‌పై చర్చించారు. ఆదాయపు పన్ను చిక్కులు, ఆర్థిక వృద్ధి, విద్య, విదేశీ వాణిజ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల పెట్టుబడి తదితర అంశాలపై చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతపై ప్రసంగించారు. బడ్జెట్‌లో పర్యావరణ స్థితి స్థాపనకు సమగ్ర విధానం లేదని, వాతావరణ మార్పులు తగ్గించడానికి తగినంత కేటాయింపులు లేవని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతు బజారులో సబ్జీ కూలర్



రైతుబజారులో కూలర్‌ను పరిశీలిస్తున్న ఈవో ప్రసాద్



కూలర్ గురించి రైతులకు వివరిస్తున్న ఈవో

- విద్యుత్ లేకుండా పనిచేస్తున్న కూలర్

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో సబ్జీ కూలర్ ఏర్పాటు చేశారు. విద్యుత్ అవసరం లేకుండా కూలర్ పని చేయడంతో ప్రజలు దీని గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇటీవల ఈ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా గోపాలపట్నం రైతు బజారులో ఏర్పాటు చేశారు. ఈ కూలర్‌లో నిర్దేశించిన పరిణామంలో నీరు పోస్తే చాలు అదే కూలింగ్ అవుతుంది. ఏరోజుకారోజు నీరు పోస్తుండాలి. ఇందులో పెట్టిన కాయగూరలు, పండ్లు పాడవకుండా ఉంటాయి. ఈ కూలర్ ఏవిధంగా వినియోగించాలి అన్న అంశాలను రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్ రైతులకు వివరించారు. ఈ కూలర్‌లో ఉంచిన కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు 4 నుంచి 5 రోజులు తాజాగా ఉంటాయని తెలిపారు. రోజుకు 20 లీటర్ల నీరు కూలర్ అంచుల్లో ఉన్న రంధ్రాల్లో వేయాలన్నారు. రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తారని చెప్పారు.

తొలగించిన చోటే మొలకలు



గోపాలపట్నంలో ఫుట్‌పాత్‌పై టిఫిన్ దుకాణం



ఫుట్‌పాత్‌పై షర్బత్ వ్యాపారం

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలు

గోపాలపట్నంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై దుకాణాల తొలగింపు హాస్యాస్పదంగా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదయం తొలగిస్తే సాయంత్రం అదే చోట వ్యాపారాలు సాగిస్తున్నారు. అదే సాయంత్రం తొలగిస్తే మరుసటి రోజు ఉదయం మళ్లీ వెలుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సుకన్య సినిమా హాలు నుంచి ఫుట్‌పాత్‌ల పై ఉన్న ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. శనివారం ఉదయం తిరిగి యధావిధిగా ఫుట్‌పాత్‌లపై తమ సామగ్రి దర్జాగా పేర్చుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇది చూసిన వారు తొలగింపులు ఎక్కడ జరిగాయంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, దుకాణదారులు అవగాహనతో వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక డ్రైవ్ సాగిస్తామని చెప్పిన మాటలు ఉత్తవేనని విమర్శిస్తున్నారు. పక్కాగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – గోపాలపట్నం

వైభవంగా పూజలు



వెంకన్నపాలెం కృష్ణాలయంలో చిన్నారుల నృత్యాలు



మల్కాపురం కృష్ణాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం మురళీకృష్ణ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మురళీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసుదేవ అన్నమయ్య సంకీర్తన సంస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి జరుపుతున్నారు.దీనిలో భాగంగా శనివారం భీష్మ ఏకాదశి పురస్కరించుకుని మందిరంలోని కృష్ణుడితో పాటు మహాలక్ష్మి దేవికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు గోవిందుడి కీర్తలు,కోలాట ప్రదర్శన చేశారు.

- మల్కాపురం గొల్లవీధిలోని కృష్ణాలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కృష్ణుడికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు.

కొత్త ఎన్‌క్లోజర్‌లో 'నీల్ గై' సందడి



జూలో కొత్తగా మార్చిన ఎన్‌క్లోజర్‌లో మనుబోతులు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మనుబోతులు (నీల్‌గై) సందర్శకులను అలరిస్తున్నాయి. ఇంతవరకు మారుమూలలో ఉండే వీటిని అధికారులు రోడ్డు పక్కన ఖాళీగా ఉండే ఎన్‌క్లోజర్లలోకి తరలించారు. విశాలమైన ఈ ఎన్‌క్లోజర్ జూ లోపల రహదారిని ఆనుకుని ఉండటంతో సందర్శకులకు ఇప్పుడు ఇవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవి వాటి ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ సందడి చేస్తున్నాయి. చూడడానికి గాడిద ఆకారంలో కనిపించే ఈ నీల్‌గై పెద్ద జింక జాతికి చెందినది. వీటిని బూడిద జింక అని పిలుస్తారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద జింక జాతి. ఇవి పగటి పూట హుషారుగా సంచరిస్తాయి. వీటి ఆహారం పచ్చి గడ్డి. ఈ నీల్‌గై పొడవైన మెడ, పదునైన పొట్టి కొమ్ములతో ఆకట్టుకుంటుంది. జూలో ప్రస్తుతం 9 మనుబోతులు(నీల్‌గై) ఉన్నాయి. వాటిలో మూడు జతలు పెద్దవి, కాగా మూడు పిల్లలున్నాయి. జూలో వీటి ఎన్‌క్లోజర్ సాంబార్ (కనుజులు) ఎన్‌క్లోజరు ఎదురుగా రోడ్డుకు కొంత దూరంలో కొన్ని సంవత్సరాలుగా ఉంది. ఇవి సందర్శకులకు సరిగ్గా కనిపించడం లేదు. ఇటీవల దాని ఎదురుగా జూ లోపల రహదారి పక్కన ఖాళీగా ఉన్న మరో ఎన్‌క్లోజర్‌లోకి అధికారులు ఒక జత మనుబోతులతో పాటు రెండు పిల్లల్ని తరలించారు. ఆ పిల్లలు తల్లి మనుబోతుతో కలసి ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి.

ఇంటికి చేరిన ఇండోర్ మహిళ



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

సీతమ్మధార : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సిటీకి చెందిన పార్వతి (65) అనే వృద్ధురాలిని శ్రద్ధా టీం సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, కోడళ్లు ఉన్నప్పటికీ కొన్నాళ్ల కిందట విశాఖ వచ్చేసింది. గత ఏడాది అక్టోబర్ 5న ఆమెను రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ద్వారకానగర్‌లో గల టీఎస్ఆర్ కాంప్లెక్సులోని జీవీఎంసీ - ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కి తరలించారు. అనంతరం ఆమె వివరాలు సేకరించి ఇండోర్‌లో నివసిస్తున్న కొడుకు జితేంద్ర చౌహాన్ వద్దకు శనివారం తీసుకెళ్లి అప్పగించామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అలరించిన నాట్యోత్సవం



చిన్నారులతో నాట్య గురువులు

సీతంపేట : శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీటీడీ పూర్వ ఈవో, తెలంగాణా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినం సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సంగీత నాట్యోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది చిన్నారులు చేసిన సంగీత, నృత్య ప్రదర్శన అలరించింది. వీరికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువులు తాళ్లపాక సందీప్‌కుమార్, ఎ.కృత్తిక, కె.కరుణామోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మీగడ శోభాషణ స్వామి, ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌందర్య, సన్‌మూర్తి, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



రమేష్‌కు కేక్ తినిపిస్తున్న పరశురామ్

విశాఖ విద్య: ఢిల్లీలో బీజేపీ విజయవం సాధించడంతో ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎన్‌డీఏ పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు పాల్గొని కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాస్,విజయబాబు ,చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో శనివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. నాయకులు పొలిమేర శ్రీను, విజయబాబు,లక్కరాజు కృష్ణరావు,ప్రకాష్ పాల్గొన్నారు.